స్కెచ్

# వెలియని వాన

సులోచన

వాన కురిసింది వెలిసింది - మళ్ళా కురుస్తుంది, ఎప్పటికో, దట్టంగా మేఘాలు పట్టినప్పుడు, చల్లటిగాలి తగిలినప్పుడు.

ఈ లోపల కురవదు. చచ్చి గీపెట్టినా. అవస రానవసరాలతో దానికి నిమిత్తం లేదు. దేవుడనే వాడు ఒకడు వుండి క్రమంగా కురిపిస్తున్నాడని అనుకోటానికి, ఎన్ని సార్లు అనవసరంగా కురిసి పంటల్ని పాడు చేయలేదు! ఇళ్ళను కూల్చలేదు!

కాని కురిసిన తరువాత వుండే ప్రకృతి వేరు. చాలా అందంగా, పచ్చగా, ఆకాశమంతా నీలంగా, నిర్మలంగా - మరీ. తెల్లటి ఎండ ఇళ్ళ మీద పడుతుంటే ఎంత అందంగా ఉంటుందని! చూసినప్పుడు ఈ వర్షాలు జ్ఞాపకానికిరావు - ఏదో యిదని నిర్ణయించలేని 'యిది'లో పడి పోతాం.

జీవితంలో కూడా ఒక దుమారం లేచిన తరువాత హాయి అనిపిస్తుంది. మళ్ళా అన్ని దుమారాల వెనకా అలా అనిపించే శక్తి లేక పోటం; పైగా బాధలో క్రుంగిపోటం మనం చూస్తున్నదే.

కళ్యాణి జీవితంలో యింతవరకూ వాన కుర వనే లేదు, హాయి అనిపించటానికి. ఆమెకిప్పుడు పదహారేళ్లు. కొత్తగా పెళ్లయింది; రెండురోజు లయిందేమో! భర్త చక్కనివాడు. విశాలమైన వక్షం, తీర్చి దిద్దిన ముక్కు - అన్ని లక్షణాలు కలవాడు కూడాను, జీవితంలో ఏ లోటూ లేకుండా వచ్చినవాడు.

పెళ్ళి జరుగుతున్నప్పుడు పొందే ఆనందాన్ని మేడల పై అంతస్థుల్లో, పందిరి మంచాలమీద, పట్టు పరుపులమీద పచ్చలైట్లు క్రింద పవ్వళించే వారు పొందే ఆనందం లాంటిదే పొందింది, కళ్యాణి. ఏదో యిదిగా, పెళ్ళికొడుకు స్పర్శ తగిలినప్పుడల్లా - మంగళసూత్రం కట్టేప్పుడు ఆయనగారు మెడమీద వేళ్ళని నాట్యం చేయించినప్పుడు, బిందెలో వుంగరం కోసం గిచ్చినప్పుడు—శరీరం జలదరించేది, మొగ్గలు తొడిగేది.

ఇక యిప్పుడామె యిలా అనుకోవాలి: 'ఇప్పుడు తన జీవితంలో వాన కురుస్తున్నది— ఇంకా వెలవలేదు. రేపు శోభనంనాడు పొందే ఆనందంలో వెలుస్తుంది. సందేహించాల్సిన అవ సరం లేదు' అని. కాని ఆమె అలా అనుకో లేదు. అసలు ఏమీ అనుకోలేదు.

అయితే ఒకటి, శోభనం రేపనగా ఆ అర్థం వచ్చేట్టు పొందబోయే ఆనందాన్ని గూర్చి కలలు కన్నది; కర్బ్యంలో కూర్చుని, పరుపుమీద పండు కొని. కలలు కల్లలని ఆమెకు తెల్సుకోదు ఎవరూ చెప్పలేదు. ఆ జ్ఞానం చెపితే వంటబట్టేది కాదని, చెప్పకుండానే తెల్సుకోవాలని ఆమె అనుకో లేదు.

కొత్తగా కాపురం చేస్తూన్న, అనుభవాన్ని జీర్ణించుకొంటూన్న యిద్దరు ముగ్గురు స్నేహితు రాండ్రని అడిగింది—ఆ అనుభూతుల్ని గూర్చి చెప్పమని. విని ఆనందించి వూహించుకొందామని.

వాళ్లు నవ్వుతూ వర్ణించి అరగంట రహస్యం చెప్పినట్లు చెప్పింతరువాత కళ్యాణి నిజం తెలుసు కొన్నానని కలలు కనటం ఆరంభించింది.

ఒక కలలో......

సుందరసదనం. సమీపాన పూలతోట. ప్రసూనాల సువాసన. వెన్నెల-నిశ్శబ్దం, గాలి గోల తప్ప.

పచ్చని గడ్డిమీద చెయి తలకు తలక్రింద పెట్టి చూస్తున్నాడు భర్త - తన కళ్ళల్లోకి—
తన ఆనందానికి మితివుందా?

భర్తకు దగ్గరగా తను పండుకొని వుంది. చేతులు పట్టుకుని అంటున్నాడు భర్త—
'ఈ చేతులకున్న కోమలం, మేఘం ఆ చంద్రునికుందా? లేదని నా అనుమానం.'

తను ఏం మాట్లాడుతుంది! సిగ్గుచేత, భర్త తనని నిజంగా పొగడుతున్నాడనే గర్వం చేత—

భరించలేక గాబోలు- ముద్దుపెట్టుకొన్నాడు. చేతులను తనుదగ్గరికి జరిపి అన్నది: 'చంద్రునికి లేకపోతే లేకపోయిందిలే, మీకుంది అంత కోమలం-!'

'నా కా-నిజంగానే' అంటూ కౌగిలించుకొన్నాడు......

మెలుకువ వచ్చింది. దిండును కౌగలించుకొని వుంది. నవ్వుకుంది. మరో కలలో...

కార్యపు గది. గోడలనిండా శృంగార రస నగ్న చిత్రాలు. పందిరి మంచం దగ్గరగా బల్ల మీద పాలు, పండ్లు, మిఠాయి..పాలు తను దగ్గరకొచ్చి త్రాగించనిదే నేను తాగనని పందెం వేసుక్కూర్చున్నాడు భర్త.

ఏం చేస్తుంది? తప్పలా. తనుకూడా అలా పందెం వేసుక్కూర్చుంటే కథ అడ్డం తిరుగుతుంది.

దగ్గరకెళ్ళి నోటికి గ్లాసందించింది, తను సగం త్రాగి తక్కిన సగం పట్టుకొని త్రాగించాడు మిగిలిన సగం, భర్త.

అప్పుడు తన వళ్లు తన స్వాధీనంలో వుందా?

చేతుల్లో పొదివి పట్టుకొని 'ఈ సౌందర్యాన్నంతా ఎక్కడ దాచావ్' అన్నాడు భర్త.

అప్పుడు తను భర్త కళ్లల్లోకి చూడటం తప్ప ఏమీ అనలేకపోయింది. తరువాత అన్నది...

'స్వర్గలోకంలోంచి అప్సరసల దగ్గర్నుంచి ఈ లోకంలోకి మీకోసం...'

కిలకిలా నవ్వుకొని కౌగిలించుకొన్నాడు.

మెలుకువ వచ్చింది, ఏమీ కాదు. తెల్సుకొన్నది తను కన్నది కలని.

వీటికి సంబంధించినవే మరికొన్ని కలలొచ్చినవి. కొన్ని కలలు సినిమాల్లోకి మల్లే తను వాంఛించిన ప్రియుణ్ని పెళ్ళి చేసుకొనేముందు ఆనందం భరించలేక కనే కలలు మాదిరిగానే కన్నది

శోభనంనాటి సాయంత్రం—

ప్రక్కన స్నేహితురాండ్రు పెట్టే గిలిగింతల్ని పరిహాసాల్ని పట్టుకోలేక 'ఉండవే, పోను!' 'అబ్బో. మీరప్పుడు ఎలాగున్నారేం?' అవతం సాగించింది, కల్యాణి.

రాత్రి ఏడు గంటలు. అద్దం ముందు నుంచొని తన సౌందర్యాన్ని చూసుకొని, నవ్వుకుంటోంది, గర్విస్తోంది.

'ఈ సౌందర్యాన్నంతా ఈ రాత్రి భర్తకు అందించి, తను క్రొత్త అనుభూతుల్ని పొందాలి కాబోలు. వాళ్ళన్నట్టు ఆ అనుభూతులు ఎంత... ఇదిగా వుంటాయో! తను ఆగ గలుగుతుందో లేదో' అనుకొంటున్నది.

ఆమె జీవితంలో వాన వెలువబోతున్నది- ఆనందాన్ని అందుకోన బోతున్నది.

సన్నని రాగంతో మేకప్ చేసుకొంటూన్నది, నిముషాలు లెక్క పెట్టుకొంటూ కల్యాణి.

హఠాత్తుగా చెమటలు కారుకొంటూ పరుగెత్తుకొచ్చాడు, రఘు-తమ్ముడు. ద్వారంలో వుండే 'లక్కా, లక్కా-'

ఆశ్చర్యంగా 'ఏమిటిరా?' అన్నది.

'అక్కా, అక్కా-మరీ...మరే-' ఏడుస్తాడు.

'ఏమిటిరా పిచ్చోల, ఏం గావాలి చెప్పు!'

ఏడుస్తూ వుంటాడు.

'చెప్పరా-మాన్నగదూ. ఏంగావాలి!'

'మరే...భావనే-'

'ఆc! బావకే...'

'పోలీసులు పట్టుకెళ్ళారు-'

'ఆc-' కుర్చీలో కూలబడింది తను నిన్నటి నుంచీ కన్న కలలు ముందర వెలుగుతున్నాయి. ప్రపంచం తలక్రిందులై పట్టున్నది.

తేరుకొటున్నటికి, ఎర్రని జీరలు వారిన కళ్ళతో బయట తండ్రి అంటున్నాడు.

'వాళ్ళదేముంది. వాళ్ళ విధి వారు నెరవేర్చారు. అసలు వీడు వాళ్ళ ఆజ్ఞలని ఎందుకు ధిక్కరించాలంట! దేశాన్ని నరకం చేస్తున్న ఆ దుండగీండ్రులతో మాట్లాడాల్సిన అవసరం వీడికెందుకు కలిగిందంట! పోనీ ఏదో జరిగింది తప్పుని క్షమించమని కోరితే వీడికొచ్చిన నామర్దా, న్యూనతా ఏమిటీ అని.'

ఆ మాటల్ని ఆలకించింది కల్యాణి.

ఆమె జీవితంలో వాన వెలువలేదు. కురుస్తానే వుంది.